క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

పరశురామావతారంలో జగన్నాథుడు



పరశురామావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

భీమునిపట్నం : భీమిలిలో నిర్వహిస్తున్న జగన్నాథ స్వామి రథోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారు పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు ఆర్.కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అవతార విశిష్టతను వివరించారు.

అపూర్వ కలయిక



ఆత్మీయంగా కలుసుకున్న స్నేహితులు

కొమ్మాది : 1986 – 91 మధ్య కాలంలో డాక్టర్ వీఎస్.కృష్ణా కళాశాలలో చదువుకున్న స్నేహితులంతా ఆదివారం సాగర్‌నగర్‌లోని ఓ రిసార్ట్‌లో కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయుడు, నంది అవార్డు గ్రహీత మీగడ రామలింగస్వామి, అప్పటి ఎన్‌సీసీ మాస్టర్ భగవాన్‌ను ఘనంగా సత్కరించారు.

నేడు సర్వసభ్య సమావేశం

పద్మనాభం : మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

బీచ్‌రోడ్డులో పశువులు, కుక్కల నుంచి రక్షించండి

తగరపువలస : భీమిలి నుంచి విశాఖ వరకు బీచ్‌రోడ్డులో పశువులు, కుక్కల బెడద నుంచి పాదచారులకు రక్షణ కల్పించాలని నగరానికి చెందిన సామాజిక కార్యకర్త గొనప అప్పన్న కోరారు. ఈ మేరకు ఆదివారం జీవీఎంసీ కమిషనర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అప్పన్న మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వెళ్లే వారిపై తరచూ పశువులు, కుక్కలు దాడులు చేస్తున్నాయన్నారు. పార్కులలోకి పశువులు చొరబడి పచ్చదనాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. వీటి నుంచి రక్షించాలని ఆయన కోరారు.

తాగునీటి సరఫరాలో తీవ్ర నిర్లక్ష్యం

- ఏడాదిగా పూర్తికాని పైప్‌లైన్ నిర్మాణం
- బోరు నీటినే వినియోగిస్తున్న మజ్జివలస వాసులు



రాజవీధిలో అలంకారప్రాయంగా కుళాయి



పైప్‌లైన్ కోసం రాజవీధిలో తవ్వేసిన లైను



కొత్తగా పైప్‌లైన్ ఏర్పాటు కోసం ప్రాథమిక పాఠశాల వైపు తవ్విన పాత లైన్



కొత్త లైను కోసం విరగ్గొట్టిన పాత కుళాయి



శిథిలమైన పురాతన బావిలో నీరు

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస పంచాయతీలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద తాగునీటి సరఫరాకు కాంట్రాక్టర్ ఏడాది కాలంగా మీనమేషాలు లెక్కిస్తున్నాడు. పాత పైప్‌లైన్ తవ్వేసి ఉన్న కుళాయిలను ఊడబెరికి కొన్ని కుటుంబాలకు అసలు తాగునీరే లేకుండా చేశాడు. పర్యవేక్షించాల్సిన గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో కూడా అధికారులు తాగునీటి సమస్యకు పరిష్కారం చూపలేకపోయారు. గోస్తనీ నది పక్కనే ఉన్నా తమ పెరట్లోని బోరుబావిలో నీరు పడని దీనస్థితి ఈ పంచాయతీలో నెలకొంది. దీంతో అన్నీ ఉన్నా అల్లుడి నోటిలో శని అన్నట్టుంది ఇక్కడ తాగునీరు దొరకని బాధిత కుటుంబాల పరిస్థితి. చేసేది లేక అందుబాటులో ఉన్న శిథిలమైన పురాతన బావి నుంచే తాగు, వాడుక అవసరాలకు నీరు వినియోగించుకుంటున్నారు. ఈ నీరు సురక్షితం కాకపోయినా విధిలేని పరిస్థితుల్లో వినియోగిస్తున్నారు. పంచాయతీలోని ఎస్సీ కాలనీలో సుమారు రెండేళ్ల క్రితం రక్షిత మంచినీటి పథకం, ఇంటింటా కుళాయిల నిర్మాణం పాక్షికంగా మిగిలిపోయింది. పైప్‌లైన్ కోసం తవ్విన సీసీ రోడ్లను సైతం కాంట్రాక్టర్ పూర్తి చేయాల్సి ఉంది. ఈ పథకానికి సంబంధించి రెండు బిల్లులు పూర్తయినా చివరి బిల్లు కావాలని కాంట్రాక్టర్ పట్టుబడుతుండగా... పనులన్నీ పూర్తయితే తప్ప ఫినిషింగ్ బిల్లు ఇవ్వలేమని ప్రజాప్రతినిధులు అంటున్నారు. దీంతో పనులు ముందుకు సాగడం లేదు.

పాత కుళాయిలతో నెట్టుకొస్తూ...

పంచాయతీలో జల్‌జీవన్ మిషన్ పథకానికి సంబంధించిన ఇంటింటా కుళాయిల నిర్మాణానికి పాక్షికంగా పనులు చేపట్టాల్సి ఉంది. ఎస్సీ కాలనీ, పంచాయతీ కార్యాలయం వీధుల్లో పాత కుళాయిలతో నెట్టుకొస్తున్నా రాజవీధి, ప్రాథమిక పాఠశాల వైపు లైన్లు తవ్వేయడంతో వీరికి ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. ఊరి చివర వ్యవసాయ బావులు ఉన్నా నీళ్లు తీసుకుని రావడానికి సరైన మార్గం లేక ఊరిలోని బావిలో దొరికిన నీటితోనే నెట్టుకొస్తున్నారు. వర్షాకాలం కావడంతో బావి నీరు వాడితే జ్వరాలు, వ్యాధులు ప్రబలుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఆరు మాసాలుగా అడుగుతున్నాం



కొత్త పైప్‌లైన్ వేస్తామని ఏడాది క్రితం పాత పైప్‌లైన్ తవ్వేసి ఉన్న కుళాయిలును పెకిలించారు. గత సంక్రాంతి నుంచి తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అప్పటి నుంచి అడుగుతున్నా ఎవరూ స్పందించడం లేదు. ఇప్పటికైనా కుళాయిలు పునరుద్ధరించి తాగునీరు అందించాలి.

– దాట్ల గోపీరాజు, మజ్జివలస

బావి నీరే తాగుతున్నాం



మరో ప్రత్యామ్నాయం లేక మా పెరట్లో పురాతన బావిలో లభించే నీటినే తెచ్చుకుని వినియోగిస్తున్నాం. అసలే వర్షాకాలం కావడంతో బావి నీరు తాగడం అంత సురక్షితం కాదు. వ్యాధులు ప్రబలే ప్రమాదం వుంది. ఇప్పటికైనా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించాలి.

– దాట్ల విశ్వనాథరాజు, మజ్జివలస

ఎర్రమట్టి దిబ్బల్లో షూటింగ్ సందడి



ఎర్రమట్టి దిబ్బల్లో షూటింగ్ చేస్తున్న దృశ్యం

కొమ్మాది : భీమలి బీచ్ రోడ్డులోని ప్రముఖ పర్యాటక ప్రాంతం ఎర్రమట్టి దిబ్బల్లో షూటింగ్ సందడి నెలకొంది. మెగా హీరో వరుణ్ తేజ్ నటిస్తున్న చిత్రానికి సంబంధించిన కొన్ని సన్నివేశాలు, ఫైటింగ్‌లను ఇక్కడ చిత్రీకరించారు. 15 రోజులపాటు విశాఖ – భీమిలి బీచ్ రోడ్డు ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ చిత్రీకరణ ఉంటుందని యూనిట్ సభ్యులు తెలిపారు.

హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్‌లో ఉదయ శంకర్



తగరపువలస : ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీకి చెందిన మామిడి ఉదయ శంకర్‌కు ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్ సెల్‌లో ఏపీ స్టేట్ జనరల్ సెక్రటరీగా పదవి లభించింది. ఈ మేరకు కౌన్సిల్ నేషనల్ చైర్మన్ షేక్ సిరాజుద్దీన్ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆనందపురంలో ఉదయ శంకర్ మాట్లాడుతూ తన పరిధిలో నేరాలు, అవినీతి, స్మగ్లింగ్, జాతి వ్యతిరేక శక్తులు, నకిలీ కరెన్సీ, బాల కార్మిక వ్యవస్థ, కట్టు బానిసత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తూ మానవ, దివ్యాంగుల, వినియోగదారుల హక్కుల కోసం పని చేస్తానన్నారు. నేర రహిత సమాజం కోసం అందరితో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు.

వాహనదారుడిపై కొమ్ములతో పశువుల దాడి

తగరపువలస : తగరపువలస – భీమిలి రహదారిపై శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చిల్ల గణేష్ రెడ్డిని జీరుపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద పశువులు అడ్డుకుని కొమ్ములు విసిరాయి. దీంతో ఆయన కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చిల్లపేటకు చెందిన క్షతగాత్రుడిని సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చేర్చి చికిత్స చేయిస్తున్నారు. తగరపువలస – భీమిలి రోడ్లపై పశువులు 24 గంటలూ తిష్ట వేసి ప్రమాదాలకు కారణమవుతున్నాయని, వీటికి జీవీఎంసీ అధికారులు అడ్డుకట్ట వేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.

చెరువు నుంచి దుర్వాసన



సంగివలస చెరువులో పక్కకు చేరిన తెట్టు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు సంగివలస చెరువులోకి ఒక వైపు తెట్టు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని చుట్టుపక్కల కాలనీల నివాసులు వాపోతున్నారు. ఇటీవల వర్షాలకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన చెత్త, పాలిథిన్‌తో చెరువు నిండిపోయింది. గాలివాటానికి ఈ చెత్తంతా ఒక మూలకు చేరడంతో పార్కులో ఆడుకోవడానికి వచ్చే చిన్నారులు, వాకింగ్‌కు వచ్చేవారు ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. దుర్వాసనకు కారణమైన చెత్తను జీవీఎంసీ సిబ్బంది తొలగించి చెరువును ప్రక్షాళన చేయించాలని కోరుతున్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

పీఎం పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామంలో ఆదివారం సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన తిలకించిన ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. నగరానికి చెందిన శ్రీ నృత్య కళాంజలి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 6 నుంచి 15 సంవత్సరాలలోపు బాలికలు తమ అద్భుత నృత్యంతో ఆద్యంతం అలరించారు. కళాకారులు రోషిణి, మేఘన, నూతన, సహస్ర, ఈషలాస్య, అశ్విత, విదేష్య, మనస్విని, భవిష్య, మహాలక్ష్మి, తన్వి, సృజన, చందన తదితర 20 మంది కళాకారులు నృత్యం చేయగా పి.రమ్య నృత్య దర్శకత్వం వహించారు. కార్యక్రమాన్ని స్థానిక ఏవో టి.విశ్వనాథ రెడ్డి పర్యవేక్షించారు.

ఎన్‌జీజీవోస్ కాలనీ రోడ్డులో అంధకారం



వీధిలైట్లు లేని ఎన్‌జీజీవోస్ కాలనీ – వుడా కాలనీ రోడ్డు

మధురవాడ : జీవీఎంసీ జోన్ – 2 కేంద్రంలో కొన్ని ముఖ్యమైన జంక్షన్లు, కాలనీలు, శివారు ప్రాంతాల్లో వీధి లైట్లు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైవే నుంచి దుర్గానగర్ మీదుగా ఎన్‌జీజీవోస్ కాలనీ, మిథిలాపురి వుడా కాలనీ నుంచి చంద్రంపాలెం వైపు వచ్చే జంక్షన్, వాంబే కాలనీ – చంద్రపాలెం, వుడా కాలనీ నుంచి ఆర్‌టీసీ కాలనీ, మల్లయ్యపాలెం పరిసర ప్రాంతాలు, హైవే నుంచి కృష్ణా నగర్ మీదుగా వాంబే కాలనీ తదితర ప్రాంతాలకు వెళ్లే రోడ్లలోని ముఖ్యమైన జంక్షన్లలో లైటింగ్ లేదు. దీంతో వాహనదారులు, పాదచారులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లోనే చైన్ స్నాచింగ్‌లు జరుగుతుండడంతో ఇంటిలో నుంచి బయటకు రావాలంటేనే మహిళలు భయపడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ ప్రాంతాల్లో వీధి లైట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువలో పేరుకుపోయిన పూడిక



పూడిక పేరుకుపోయిన పాండ్రంగి దివాన్లి కాలువ

పద్మనాభం : మండలంలోని పాండ్రంగి దివాన్లి కాలువ తుప్పలు, డొంకలతో నిండిపోయింది. దీంతో కాలువలో సరిగా నీరు వచ్చే అవకాశం లేదు. మద్ది గ్రామం సమీపంలోని గోస్తనీ నదిలోని ఏటుకట్టు నుంచి తాటితూరు వరకు ఈ కాలువ ఉంది. ఈ కాలువ కింద పాండ్రంగి, భీమునిపట్నం మండలం తాటితూరు, ఆనందపురం మండలం గొట్టిపల్లి గ్రామాలకు చెందిన సుమారు రెండు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. తుప్పలు, డొంకలతో నిండిపోవడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయనున్న వరి పంటకు సాగు నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. పాలకులు, అధికారులు స్పందించి కాలువలో పూడిక తీసేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గుర్తింపు కార్డులు తప్పనిసరి

విశాఖ విద్య: మద్రిపాలెం రైతు బజారును వ్యవసాయ,వాణిజ్య మార్కెటింగ్ అధికారి యాసిన్ ఆదివారం పరిశీలించారు. రైతు బజారులో ఏర్పాటు చేసిన కందిపప్పు, రైస్ స్పెషల్ కౌంటర్‌ను పరిశీలించి విక్రయాలు ఎలా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులు, దుకాణదారులతో మాట్లాడివారి సమస్యలు తెలుసుకున్నారు. దుకాణదారులంతా తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించేలా శ్రద్ధ తీసుకోవాలని రైతు బజార్ ఎస్టేట్ అధికారి కొమ్మనాపల్లి వరహాలుకు సూచించారు. వినియోగదారులకు కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రైతు బజారులో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

సీఐటీయూ కమిటీ ఏర్పాటు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సీఐటీయూ నూతన కమిటీ ఆదివారం ఏర్పాటు చేశారు. కమిటీలో సభ్యులుగా టి.ఆదిలక్ష్మి, కె.సుశీల, చిన్ని, కె.విమల, స్వాతి, పి.సూర్యనారాయణ, దామోదర బాలాజీ, జోగ వెంకటరావును నియమించారు. సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా ఎం.సూర్యకుమారిని నియమించి వీరికి మార్గదర్శకాలు విడుదల చేశారు. జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, సహాయ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో కమిటీని నియమించారు.

ఆటోడ్రైవర్ అదృశ్యం



నాగ శేషుబాబు

తగరపువలస : ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ నేలతేరు ఇందిరా గాంధీ కాలనీకి చెందిన భేరి నాగశేషుబాబు గత గురువారం ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా అదృశ్యమైనట్లు తెలిసింది. ఈయనకు భార్య మణి, కుమారుడు ఉన్నారు. వీరి ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



గంధవరంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

పద్మనాభం : మండలంలోని రెండు గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి, హిందు జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు ప్రచారం చేశారు. గంధవరం, విలాస్కాన్‌పాలెం పంచాయతీ తిమ్మాపురం గ్రామాల్లో ఈ ప్రచారం నిర్వహించారు. భగవద్గీత విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు వి.సురేష్, ఎస్.శ్రీనివాస్, భారతి, లక్ష్మి పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమ బాలలకు అల్పాహారం



తాళ్లవలసలో బాలలకు అల్పాహారం అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

తగరపువలస : చిట్టివలస, తగరపువలస నాగవంశ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాళ్ల గురునాయుడు 80వ జయంతి సందర్భంగా ఆదివారం కేజీఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథలకు అల్పాహారం ఏర్పాటు చేశారు. భీమిలి మండలం తాళ్లవలస లిటిల్ హగ్స్ బాలల ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షుడు కాళ్ల శ్రీనివాస్, పిట్ట వెంకటరావు, మద్దిల దినేష్, కాళ్ల పురుషోత్తం, ఉప్పల రమేష్, చిల్ల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

అమనాంలో యువకుల శ్రమదానం



అమనాం రహదారికి ఇరువైపులా తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

తగరపువలస : భీమిలి మండలం అమనాం పంచాయతీలో యువత ఆదివారం శ్రమదానంతో రహరులకు ఇరువైపులా తుప్పలు తొలగించారు. జాతీయ రహదారి నుంచి ఊరి వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల పరిధిలో పొక్లెయిన్ ఉపయోగించి తుప్పలు తొలగించారు. చుక్క ఆదిరెడ్డి ఆధ్వర్యంలో మరగడ రఘురామిరెడ్డి, కంబపు శివకుమార్, అలమండ మంగరాజు, దాసరి సూరిబాబు, బార రాంబాబు, కడారి బంగారయ్య, బోర గురునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు

- గిరిప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన



తొలిపావంచా వద్ద ట్రాఫిక్ నియంత్రణపై చర్చిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, ఇతర అధికారులు

సింహాచలం: గిరి ప్రదక్షిణ రోజు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టిసారించారు. దీనిలో భాగంగా భక్తులు బయలు దేరే కొండదిగువ శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి తొలిపావంచా వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తితో కలసి నార్త్ ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ ఆదివారం సాయత్రం పరిశీలించారు.

భక్తులు తొలిపావంచా వద్దే కొబ్బరికాయలు కొట్టి ప్రదక్షిణ ప్రారంభిస్తారు. దీంతో ఆప్రదేశంలో ఏర్పాటు చేయాల్సిన క్యూలు, భక్తుల మధ్య తోపులాటలు లేకుండా చేయాల్సిన ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కొబ్బరికాయలు కొట్టేందుకు ఎన్ని ర్యాంపులు వేయాలో పరిశీలన చేశారు. వాహనాల పార్కింగ్ కోసం కేటాయించాల్సిన ప్రాంతాలను గుర్తించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే ఫిర్యాదుల పరిష్కారం

- సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సౌకర్యాలు, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆరిలోవ కాలనీ, హెల్త్ సిటీ పరిసరాలు, అపోలో ఆస్పత్రి వెనక భాగం తదితర ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి పర్యటించారు. నిర్మానుష్య ప్రాంతాలలో తరచూ పోలీస్ గస్తీ నిర్వహించాలని, ఖాళీ ప్రదేశాలలో తుప్పలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సీఐ గోవిందరావును ఆదేశించారు. గంజాయి వాడకంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్‌పై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలకు సహకరించే విధంగా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సీపీ ఆదేశించారు. గంజాయి క్రయ విక్రయాలతో పాటు గంజాయి వినియోగిస్తున్న వారిపై నిఘా పెట్టాలన్నారు. గంజాయి నియంత్రణ కోసం రోజూ 15 మంది ఏఆర్ పోలీసుల బృందం ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో సాయంత్రం సమయంలో తిరుగుతుందని, వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'మొల్ల రామాయణం' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: విశాఖ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆచార్య కోలవెన్ను మలయవాసిని రచించిన, తిరుమల తిరుపతి దేవస్థానం వారు ముద్రించిన మొల్ల రామాయణ పరిమళ వ్యాఖ్య గ్రంథావిష్కరణ కార్యక్రమం ఆదివారం లలితానగర్ లలితా పీఠంలో జరిగింది. డాక్టర్ ఈదర పెద వీర్రాజు చేతుల మీదుగా ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడిన ఎందరో కవుల్లో మొల్ల కూడా ఒకరని, ఆమె ఒక మహిళై ఉండి కూడా ఆనాటి పురుషాధిక్య సమాజంలో రామాయణాన్ని రచించడం సాహసోపేతమైన చర్యని కొనియాడారు. గ్రంథ రచయిత కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ మహిళల్లో మొట్టమొదటి రచయిత్రిగా మొల్ల రామాయణాన్ని రచించారని, ఇటువంటి గ్రంథానికి వ్యాఖ్యాన గ్రంథం ఉండాలనే సంకల్పంతో ఈ రచనకు పూనుకున్నానని తెలిపారు. విశాఖ సాహితి ఉపాధ్యక్షురాలు డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి, ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, డి.వి.సూర్యారావు, శంకర్ నీలు భాగవతుల సభ్యులు గండికోట విశ్వనాథం, అన్నవరపు శ్రీనివాసరావు, సాయిబాల, ఎ.వి.జోగారావు పాల్గొన్నారు.